# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో పలు ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.
- ❖ నిత్యవసర సరుకులను అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.
- ❖ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.
- ❖ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. వాయుగుండంగా మారిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

=======================

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఆయా జిల్లాల్లో పరిస్థితులపై జిల్లా కలెక్టర్లు, ఉన్నత అధికారులతో ముఖ్యమంత్రి శ్రవణమాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాల ప్రభావం కనిపిస్తున్న నేపథ్యంలో ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ... ప్రాణనష్టం లేకుండా చూసుకోవాలని సూచించారు. భారీ, అతి భారీ వర్షాలు పడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో తాగునీరు, ఆహారం, వైద్య శిబిరాలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని.. వరద ప్రభావిత ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.

=======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు రాజ్ భవన్ లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల సంభవించిన వరద పరిస్థితి, నష్టం, ప్రభుత్వం చేపట్టిన సహాయ, పునరావాస చర్యలను గవర్నర్ కు ముఖ్యమంత్రి వివరించారు. సహాయక చర్యలను

స్వయంగా పర్యవేక్షిస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న చర్యలను గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందించారు. త్వరలోనే పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటుందని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

======================

నిత్యవసర సరుకులు అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లి, తుమ్మలపాలెం, ఇబ్రహీంపట్నంలలో ప్రభుత్వం అందించే నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కష్టకాలంలో అందరూ నిజాయితీతో బాధ్యతగా పని చేయాలని కోరారు. ముంపు ప్రాంతాలలో ప్రతి కుటుంబానికి సరుకులు అందే విధంగా చర్యలు చేపట్టమన్నారు. నిత్యవసర సరుకులను వ్యాపారస్తులు అమ్మకపు ధరకు మించి అమ్మితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

======================

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. వాయుగుండంగా మారిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది ఒడిశా - బంగాల్ తీరాన్ని ఆనుకుని, క్రమంగా వాయవ్యదిశగా కదులుతోందని పేర్కొంది. ఇది రాబోయే 24 గంటల్లో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుందని, ఆ తర్వాత పశ్చిమ వాయువ్య దిశగా కదిలి రేపు రాత్రికి ఒడిస్సా లోని పూరీ, పశ్చిమ బెంగాలోని దిఘుల మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో రాగల 24 గంటలలో కోస్తాంధ్ర జిల్లాల్లో పలు చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కాగా ఉత్తర కోస్తా జిల్లాల్లో ఇప్పటికే కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు చేరుతోంది.

======================

రేపటి నుంచి భారీ వర్షాలు, వరద నష్టాన్ని అంచనా వేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈరోజు విజయవాడలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఆదేశాలతో అందరికీ మూడు పూటలా ఆహారం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈరోజు 3 లక్షలకు పైగా ఆహార ప్యాకెట్లు, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశమన్నారు. ధరల నియంత్రణపై దృష్టి సారించమని, రాయితీపై కూరగాయల విక్రయిస్తున్నామని తెలిపారు. ఫైర్ ఇంజన్ల ద్వారా యుద్ధ ప్రాతిపదికన ఇళ్లను శుభ్రం చేసే ప్రక్రియ చేపట్టమని, ఇప్పటికే 20 వేల ఇళ్లకు పైగా శుభ్రం చేసినట్టు మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

విరామం

======================

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రాజమహేంద్రవరంలో జరుగుతున్న 78వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభ వేడుకలో కేంద్ర మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పించడం వల్ల వారి ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందన్నారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం “ఖేల్ ఇండియా పథకం” ద్వారా 900 కోట్ల రూపాయలు కేటాయించిందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

=======================

వాయుగుండం ప్రభావంతో విశాఖలో భారీ వర్షాలు కురుస్తున్నందున కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని మహా విశాఖ నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, ఉన్నతాధికారులకు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు విజయవాడ నుండి శ్రవణ మాద్యమం ద్వారా వాతావరణ పరిస్థితులపై సమీక్ష నిర్వహించిన కమిషనర్ మాట్లాడుతూ... ఇప్పటికే విశాఖలో 11 సెంటీమీటర్ల వర్షం కురిసిందని, ఇంజనీర్లు, అధికారులు తక్షణమే కొండవాలు, లోతట్టు, ముంపు గురైన ప్రాంతాలను గుర్తించి పర్యటించాలన్నారు. కొండవాలు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ.. వారిని సమీపంలోనున్న సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్లపై, వీధుల్లో చెట్లు విరిగిపడే అవకాశాలు ఉన్నందున వాటిని వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని, సహాయక చర్యలో పాల్గొంటూ అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండాలని కమిషనర్ ఆదేశించారు.

=======================

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాల పై ఎప్పటికప్పుడు సమచారాన్ని చేరవేసేందుకు విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలోని 11 మండలాల్లోని తాసిల్దార్ కార్యాలయాల్లో ఫోన్ నెంబర్లను జనబాహుళ్యంలో వుంచారు. వర్షాలకు సంబంధించి ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు, ప్రజలకు అందుబాటులో అత్యవసర సేవలు చేరవేసేందుకు సదరు నెంబర్లను ఉపయోగించుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

=======================

పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన వందరోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఈరోజు మంత్రి ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా దాదాపు 7 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని.. మిగిలిన ఇళ్లను 2025, మార్చి నాటికి పూర్తి చేసేందుకు కృషిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పనులను వేగవంతం చేసేందుకు కృషి చేయాలి అన్నారు.

=======================

=======================